# నింద

**- బేతనపల్లి బోస్**

అమెరికాలో వున్నా, ఆంధ్రాలో వున్నా, పండుగల్ని మర్చిపోవడం సుబ్బారావు తత్వం లోనే లేదు.

"నాగుటించి పట్టించుకోక పోయావో........ జాగ్రత్త! నేనేమిటో నా పవరు ఏమిటో...... మానవుల దగ్గరనుండి ముక్కోటి దేవతల వరకూ తెలియనిది కాదు" అని చెప్పే వినాయక చవితిని మర్చిపోవడమా?

అమెరికాలో పని సౌలభ్యం కోసం, సోమవారం నుండి శుక్రవారం మధ్యలో పడ్డ పండుగల్ని, వారం చివరకు తోసేయడం ఆనవాయితి. వాతావరణం మరియూ ఇతర పరిస్థితుల వల్ల అప్పటికి, ఆ పండుగ జరుపుకోవడం కుదరక పోతే, ఆ పైవారానికి పోష్టుపోను చెయ్యడం అతి సాధారణం.




కాని సుబ్బారావు అలాకాదు ఘడియలు, విఘడియలు లెక్క జూసుకున్నాడు. టంచన్‌గా ఉదయం ఏడో గంటకు వినాయకపూజ జరిగిపోవాలి. కాలెండరు ప్రకారం, పండుగ వారం మధ్యలో పడింది. అయితే ఏమిటి? టైమ్, చాలా చక్కగా, భేషుగ్గా కుదిరి పోయింది. ఏడో గంటకు పూజ అయిపోతే, కొడుకు హరి స్కూలు టైమ్‌కి. తన ఆఫీస్ టైమ్‌కి గాని ఇబ్బంది లేని ముహూర్తం.

మరునాడు - చవితి రోజు ఉదయం, ఐదుగంటల సమయం. పన్నెండు సంవత్సరాల కొడుకు హరిని లేపే ప్రయత్నంలో వున్నాడు సుబారావు. లేవనుగాక లేవను అని పేచీ పెట్టాడు హరి. లేవడం కష్టం, డాడ్ అని సర్దుకు పడుకున్నాడు. పెందరాళే కొడుకును నిద్ర లేపడం సుబ్బారావు సహనానికి పరీక్షే అయింది.

అప్పటికే స్నానం ముగించి అటు వచ్చిన శాంత "నాన్నా, హరీ, లేరా" అంటూ వంటగది వైపు నడిచింది, ఆగకుండానే. వేరే మాట లేకుండా, హరి లేచి కూర్చున్నాడు.

శాంత సుబ్బారావు భార్య. సౌమ్యురాలు. గంభీర మూర్తి. మితభాషిణి. సుబ్బారావుకు ఎప్పుడూ ఆశ్చర్యమే. తను అరచి ఘీపెట్టినా, వినని కొడుకు - వాళ్ళమ్మ "నాన్నా" అని అన్న ఒక్క మాటతో సెట్ రైటు అయిపోతాడు.

ముచ్చటగా, ముగ్గురూ కూర్చున్నారు పూజకు. వినాయక చవితి కథా పుస్తకం చదివాడు సుబ్బారావు. అర్థం కానిది అయినా అమ్మమీద ప్రేమ వల్లో, తండ్రి మీద భయం వల్లో కధని శ్రద్ధగానే విన్నాడు హరి. ఆయురారోగ్య సుఖసంతోషాలతో పాటు ఎలాంటి నిందలూ రాకుండా చేయమని వినాయకుణ్ణి ప్రార్థించాడు సుబ్రావ్. పూజ ముగిసింది.

పూజ కోసం చేసిన ఉండ్రాళ్లు, వడపప్పు, బ్రేక్ ఫాస్టుగా తిన్నారు ముగ్గురు.

School Busలో హరి స్కూలుకి వెళ్ళాడు. భార్యకు బై చెప్పి ఆఫీసుకు వెళ్లాడు సుబ్బారావు. పని మీద ధ్యానం కుదరలేదు మనసంతా గతవారంలో జరిగిన సాహితీ సదస్సులో కొన్న "భరాగో 116" గొప్ప సినిమాపాటల సంకలనంతో నిండిపోయి వుంది. టైమ్ కుదరక, ఇంతవరకూ, పేకెట్ ఓపెన్ కూడా చెయ్యలేదు.

సీట్లో *అనీజీగా* కదిలాడు. అటూ ఇటూ చూశాడు పిచ్చిగా. అవసరం అయినప్పుడు, ఆఫీస్‌లో లేట్ అవర్సు ఎలాగూ వుంటాడు, పని ముగించేదానికి. ఈ రోజు వినాయక చవితి. ఎప్పుడో సాయంత్రం ఇంటికి వెళ్ళే టైమ్‌కి చవితి చంద్రుడు వద్దు అనుకొన్నా కన్పించే

ప్రమాదం వుంది. చెడుచూడొద్దు, వినొద్దు, మాట్లాడొద్దు అన్నట్లు తెలిసి ఎందుకు రిస్కు తీసుకోవడం?

వుండబట్ట లేక, వాళ్ళ బాస్‌తో, ఒంట్లో బాగాలేదు అనిచెప్పి, మధ్యాహ్నం మూడో గంటకల్లా ఇల్లు జేరిపోయాడు సుబ్రావ్. భార్యకు హలో చెప్పి, సోఫావైపు నడిచాడు. సోఫా వెనుకనే వున్న కిటికీ కర్టెన్ పూర్తిగా మూసేశాడు, ముందు జాగ్రత్తగా. హమ్మయ్య చంద్రుణ్ణి చూడవల్సిన ఆపద తప్పింది. కంప్యూటర్‌లో bugs వచ్చినప్పుడు ఏదో విధంగా ఫిక్సు చేసుకోవడం మామూలే. అది మిషను ప్రాబ్లమ్. నింద అనేది మనిషి ప్రాబ్లమ్. ఫిక్సు చేయడం కష్టం. అలా అనుకుంటూ కూర్చున్నాడు విశ్రాంతిగా.

భార్య ఇచ్చిన కాఫీ చప్పరిస్తూ, "భరాగో" సినిమా పాటల పాకేజ్ ఓపెన్ చేశాడు. పుస్తకం చూడముచ్చటగా వుంది. కవర్ పేజి వెనుక పేజ్ లామినేట్ చేసివుంది. బాండ్ పేపరు మీద ముద్రణ ముచ్చటగా వుంది. రెండు పేజీలు తిప్పగానే "భరాగో"ఫోటో, ప్రక్కనే "సుఖకష్టాలు" అన్న టైటిల్‌తో ముందు మాటలున్నాయి. కష్టసుఖాలు అన్న మాటని ఈయన తిప్పిరాశారే అనుకుని, తీపి అలసట కలిగేటంత ఆత్రంగా చదవడం ప్రారంభించాడు సుబ్రావ్.

కొంచం చదివిన తరువాత "ఓపిక లేని వాళ్లు దీనిని వదిలేసి ప్రక్క పేజీల్లోకి వెళ్లిపోవచ్చు" అని "భరాగో" వ్రాసినట్లుగానే, పాటల పట్టికలోకి వెళ్లాడు. "సీతాకల్యాణం" హరికథని ఎంచుకొన్నాడు మొదటి పాటగా. పండుగరోజు, పుణ్యం, పురుషార్థం అంటే మాటలా!

సీతాకల్యాణం పాటలో - నాయనలారా, ఇది సీతా కల్యాణ సత్కథ. సీతాదేవి స్వయంవరానికి ముల్లోకాల నుండీ విచ్చేసిన వీరాధివీరుల్లో అందరినీ ఆకర్షించిన దివ్య సుందర మూర్తి ఎవరయ్యా అంటే, "రఘు రాముడు, శ్రీరాముడు"

అంతవరకూ బాగానే అనిపించింది సుబ్రావ్‌కు. అందం అందరినీ ఆకర్షిస్తుంది.అందాన్ని ఆరాధంచడంలో తప్పులేదు, కావాలని కోరుకోవటంలోనే వుంది.

....అలా విజయం చేస్తున్న శ్రీరామ చంద్రుణ్ణి, ఓరకంట చూసినదై, చెంగటనున్న చెలికత్తెతో, "ఎంత సొగసుగాడే, మనసింతలోనె దోచినాడే.... శ్యామలాభి రాముని జూడగ నామది వివశమాయె నేడే" అని పరవశంతో పాడుతుంది.

అది బాగానే నచ్చింది సుబ్రావ్ కి.

....అక్కడ స్వయంవర మండపంలో, సభాసదులతో జనకుడు "ముక్కంటి వింటి నెక్కిడ జాలిన .... ఎక్కటి జోదును నేడు, మక్కువ మీరగ వరించి మల్లెల మాలవైచి పెండ్లాడు" అని ఛాలెంజ్ చేయడం సుబ్రావ్ కి నచ్చలేదు. సీతాస్వయంవరం అన్నప్పుడు, సీతాదేవి స్వయంగా తన మనసులో కోరుకొన్న మనిషి మెడలో మాల వేసినట్లయితే, న్యాయంగా వుండేది. మొదటి చూపులోనే సీతాదేవి మనసు శ్రీరాముడి వశం అయినప్పుడు - ఏ కాకాసురుడో, బకాసురుడో, రావణాసురుడో విల్లు విరిచినట్లయితే, అతనికే సీతాదేవి భార్య అయివుండేది. మనసు ఒకరికి తనువు మరొకరికి! ఛ ఛ సుబ్బారావు మనసు ఏదోలా అయిపోయింది.

ఓరగా, వంటగదివైపు చూశాడు. వంట చేస్తున్న శాంత వెనుక భాగం కన్పిస్తుంది. సీతాదేవి టైమ్‌కి, ఇప్పటికి పెద్దతేడా లేదనిపిస్తుంది. "భుజబలం" చూపించ గలిగినవాడు "సీతాదేవికి" భర్త, మామగారిచ్చిన "కట్న బలం" నచ్చిన వాడు "శాంత"కు భర్త. అక్కడ బలం, ఇక్కడ ధనం. సీతాదేవి మనసు జనకుడు పట్టించు కోలేదు. శాంత మనసు వాళ్ళ నాన్న పట్టించుకోలేదు. తన కంటే ముందు, శాంతను పెళ్లిచూపులకు వచ్చిన వాళ్లలో శాంత మనసుకు నచ్చిన వాడు ఎవరని ?

ఎప్పుడూ శాంత చెప్పలేదు. తను అడగలేదు. ఎందుకని అడగలేకపోయాడు? కాలేజీలో వున్నప్పుడు "కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటాను" అన్న మాటలు, "పెళ్లిలో కట్నం లేకుండా తాళి కట్టను" అన్న మాటలు గుర్తొచ్చాయి సుబ్రావ్‌కి. మాటలకు మహాత్ముడు చేతలకు పాపాత్ముడు. చెప్పరాని అశాంతితో మనసు వికలమైయ్యింది.

వంటగదిలో పని చేస్తున్న శాంత కూడా పాట వింటూనే వుంది. శాంత ఇలా అనుకుంది. సీతాదేవి ఒక విధంగా అదృష్టవంతురాలు. భావస్వాతంత్ర్యంతో పక్కనే వున్న చెలికత్తెతో నయినా మనసులో మాట చెప్పుకుంది. వ్యక్తిస్వాతంత్ర్యం, భావస్వాతంత్ర్యం, ఆర్థికస్వాతంత్ర్యం, స్వాతంత్ర్యం అంటే కూడా తెలియని వాళ్లు, రామాయణ కాలం నుండీ, నేటివరకూ, కారణాలు ఏమైనా కోకొల్లలుగా వున్నారు.

బాల్యం మీరకుండానే, ఆడపిల్లలకు పెళ్లిళ్లు జరిగి పోవడం, ఆయుషుతీరకుండానే బలవంతంగా చనిపోవడాలు, చంపబడడాలు, ఆడది అంటే ఆస్తితో

సమానం, ఎవ్వరి కంటా పడకూడదన్నట్లు బురఖా ధరించే నిర్బంధనలు, బురఖాలు వేసుకొంటే కాలేజీల్లో సీట్లు ఇవ్వకపోవడాలు, మతమనే మంచి మాటలు చెప్పవల్సిన ప్రీస్టులే, లేతమొగ్గలుగా వున్న ఆడపిల్లల్ని మానభంగాలు చేయడం, చిన్న చిన్న ఆడపిల్లల్ని వయసుతో సంబంధం లేకుండా ఎగబడి కొనుక్కుని పోతున్న ఆరబ్‌షేక్స్ ఆగడాలు ...... పతితులు, భ్రష్టులు ఎలా పుడతారో, చెప్పక చెప్పే ఈ సమాజం తీరు చూస్తుంటే ఆ సీతాదేవికి కోరుకున్న మనిషితో పెళ్లి కావడం అన్నది అదృష్టమే మరి.

వికలమనస్కుడై కూర్చున్న సుబ్బారావు హరికథ అయిపోయి, ఇంకా వేరే పాటలు కూడా అయిపోతుండడం గమనించుకోలేదు. అంతలో బయట బస్సు ఆగిన శబ్దం విని టేపు ఆపుచేశాడు.

మధ్యాహ్నం, స్కూలు అయిపోవడంతో హరి ఇంటికి వచ్చాడు. సుబ్బారావుని చూస్తూ, హాయ్ డాడ్ అంటూ -- శాంత దగ్గరకు వెళ్లి హగ్ ఇచ్చి - అమ్మా, నేను ఆడుకోవడానికి వెళ్లేదా ? అని అడిగాడు.

“ఉదయం తొందరగా లేచావుగదా. హోం వర్కు చేసుకో. ముందుగా లెక్కలు చేసి డాడీకి చూపించి, చెక్ చేయించుకో. డాడీ కూడా తొందరగా ఇంటికి వచ్చారు. ఈరోజు కాసేపు చదువుకుని, తిని, తొందరగా నిద్రపో“ అంది.

అమ్మ మాట హరికి మంత్రం. ఇష్టాఇష్టాలతో నిమిత్తంలేదు. అలాగే అంటూ, పెట్టింది తిని, హోం వర్కు చేసేదానికి కూర్చున్నాడు.

ఏదో లోకంలో వున్న సుబ్బారావుని ఎవరో కుదిపినట్లయి కళ్లుతెరిచాడు. ఎదురుగా హరి నిలబడి వున్నాడు. “ఐ యామ్ డన్ విత్ మాత్ డాడ్“ అన్నాడు.

అంత తొందరగానా! అన్నాడు సుబ్రావ్ ఆశ్చర్యంగా. ఆన్సర్స్ చెక్ చేసి, గుడ్, మరి నీ workout పేపరు చూపించు, ఎలా సాల్వు చేశావో చూస్తాను“ అన్నాడు. "work out" అఖ్ఖరలేదు. ఆన్సర్స్ కాపీ చేసి, మాత్ ముగించాను“ అన్నాడు హరి.

సుబ్బారావు మనసు అదోలావుంది. పుండు మీద కారం అన్నట్లుగా, ఖయ్యిమన్నాడు హరి మీద. "work out పేపరు అంటే backup కాపీ లాంటిది. అది లేకపోతే నీకు problem ఎలా solve చెయ్యాలో ఎప్పటికీరాదు. మళ్లీ చేసి step by step ఎలా solve చేశావో చూపించు“ సుబ్బారావు గద్దించాడు.

హరి మొగంలో కోపము, ఏడుపు రెండూ కలిసి వచ్చేలా వున్నాయి. ఎర్రని మొఖంతో “డాడ్, ఉదయం వినాయక పూజ చేశాం. అప్పుడు మీరు వినాయకుడు ఎంత శక్తిపరుడో ఎంత యుక్తిపరుడో అని మెచ్చుకొన్నారు. ముల్లోకాల ప్రదక్షిణ కోసం కుమారస్వామి, నెమలి వాహనం వేసుకొని, రయ్యిన బయలుదేరితే, వినాయకుడు మాత్రం తల్లిదండ్రుల చుట్టూ మూడు సార్లు తిరిగి “ముల్లోకాలకు మీరే తల్లిదండ్రులు, మీచుట్టూ తిరిగితే, మూడు లోకాలు తిరిగినట్లే“ అని చెప్పినప్పుడు శివపార్వతులకు ఆనందంతో మతులు పోయాయని చెప్పావు.“

వినాయకుడు workout లేకుండా ముల్లోకాలు యాత్ర చేస్తే, అది ఎంతో గొప్ప విషయంగా మెచ్చుకున్న మీరు - అదేవిధంగా తక్కువ టైమ్‌లో సులువుగా math చేస్తే ఎందుకు మెచ్చుకో లేక పోతున్నారు నన్ను? పైగా కోపం. డాడ్, మీరు చెప్పేది ఒకటి చేసేది మరొకటి. మీదంతా డబుల్ స్టాండర్డు. హిపోక్రసి“ అంటూ విసవిసా నడిచిపోయాడు హరి.

సుబ్బారావుకు నోట మాట రాలేదు. శాంత హరి వెనకాలే వెళ్లి ఏమి చెప్పిందో తెలియదుగాని ఏశబ్దం వినిపించలేదు సుబ్బారావుకు. అంతా నిశ్శబ్దమే. భోజనానికి లేవొచ్చు అని పిలిచేవరకూ నిశ్శబ్దమే.

ముగ్గురు భోజనాలకు కూర్చున్నారు. హరి వైపు చూశాడు సుబ్బారావు. మీతో మాట్లాడడం నాకు ఇష్టం లేదన్నట్లుగా వుంది వాడి వైఖరి. తలవంచుకు తింటున్నాడు. వాడిలో రోజూ వుండే హుషారు వీసమంత లేదు. పండుగ రోజున కొడుకు మీద కోపగించుకోవడం సుబ్బారావుకు తనమీద తనకే కోపం వచ్చింది.

ముద్దు ముద్దు మాటలతో మైమరపించే హరి, చిట్టిపొట్టి ఆటలతో అలరించే హరి ఇలా ఖిన్నుడై కూర్చోవడం చూస్తుంటే - తండ్రిదగ్గర పిల్లకు భయం వుండాలని చెప్పే శాంత మీద కోపం వచ్చింది.

చదువు, సంధ్య, ఉద్యోగం, హోదా, డాబు, దర్పం అని నేర్పించే సంఘనీతినియమావళి మీద కోపం వచ్చింది.

మనుష్యులు ఇలానే వుండాలి అని పెట్టిన కట్టుబాట్ల మీద, ఎన్నోతరాల నుండి వస్తున్న ( మూఢ) నమ్మకాల మీద చెడ్డకోపం వచ్చింది.

కొడుకును దగ్గరకు తీసుకొని గుండెలకు హత్తు కొందామన్న కోర్కె ఎంత బలంగా వున్నా - కుర్చీలో నుండి లేవనీకుండా సుబ్బారావుని కట్టిపడేసిన “డిసిప్లిన్“ అన్న రక్కసి మీద మహా కోపం వచ్చింది సుబ్బారావుకు.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ, శాంత సౌమ్యంగానే అడిగింది. “అయితే భరాగో పాటలు ఎంతకు కొన్నారు“ అని. చెప్పాడు సుబ్రావ్ .

అదోలా చూసింది సుబ్బారావు కళ్ళలోకి. ఆ చూపంటే సుబ్బారావుకు భయం. ముల్లులా గుండెలో గుచ్చుకుంటుంది. ఈ మధ్య అది మరీ లోతుగా వెళ్లి, ఎక్కడా ఆగను అన్నట్లుగా వుంది.

మాట్లాడితే, పోట్లాడదామని చూస్తున్నాడు. గుండెల్లో బరువు తగ్గించే ఛాన్స్ సుబ్బారావుకు ఎప్పుడూ ఈయలేదు, ఇప్పుడూ ఈయలేదు శాంత.

క్రిందటి వారం, షాపింగ్‌కి వెళ్లినప్పుడు షోకేసులో వున్న అందమైన చీరను ఆసక్తిగా చూస్తున్న శాంతతో, చూస్తే చూశావుగాని, కొనమని అడగొద్దు అని హెచ్చ రించాడు. అది ౨౫ డాలర్ల అందమైన Binny Silk Saree.

అప్పుడు కూడా ఇదే చూపు. ముల్లు చూపు. మాటలకు అందని నింద. మహానింద. ఎన్నో అర్థాలు స్ఫురిస్తాయి ఆ చూపులకు.

స్వామీ, వినాయకా, పుస్తకంలో వున్నట్లు నీకథ చదివాను. పూజ చేశాను. చవితి చంద్రుణ్ణి చూడలేదు. మరి ఎందుకు నాకీ బాధ? ఏమిటి నీ లీల? అనుకుంటూ, అలవాటుగా తల ఆకాశం వైపు తిప్పి, ఈ రోజు ‘చవితి‘ అని జ్ఞాపకం వచ్చి, చటుక్కున తలదించేసుకున్నాడు.

జుట్టు పీక్కుందాం అనుకున్నాడు. నీట్‌గా వున్న డైనింగ్ టేబుల్ ముందు అలా చేయడం నాగరికత కాదని, జుట్టుపీక్కో లేకపోయాడు.

హెల్ విత్ మానర్స్, నాజుట్టు నా ఇష్టం, పీక్కుంటే ఏం అనుకున్నాడు.

నిశితంగా సుబ్బారావునే చూస్తున్న శాంత కళ్ళలోకి చూసి, భార్యా పిల్లల ముందు జుట్టుపీక్కోవడం సభ్యత కాదు అనుకొని రెండవ సారి కూడా జుట్టు పీక్కోలేక పోయాడు...... సుబ్బారావు.

(అంకితం: గురుతుల్యుడు, స్నేహశీలి స్వర్గీయ శ్రీ కిడాంబి రఘునాథ్ గారికి.)


# DENTISTRY FOR THE ENTIRE FAMILY




## DENTAL ILLUMINATIONS

### Madhavi V. Kadiyala, DDS & Associates

***General and Cosmetic Dentistry***

- Digital Radiography X-Ray with Less Radiation
- Oral Hygiene, Sealants. Fluoride
- Bonding, Porcelain Veneers & Lumineers
- Teeth Whitening
- Periodontal Treatment

- One Visit Root Canals
- Metal Filling Replaced with White Restorations
- Surgical & Non Surgical Extractions
- Porcelain Crowns, Bridges & Complete Dentures

**Walk-ins & New Patients Welcome**

**Most Insurance Plans Accepted**

**Please Call For Appointments at Two Convenient Locations**

660 Princeton Meadows
Shopping Center,
Plainsboro Road
**Plainsboro, NJ 08536**

**609-275-9688**

Hopewell Crossing
800 K Denow Road
(Next to Stop & Shop)
**Pennington, NJ 08534**

**609-303-0571**

***ramkolluri@yahoo.com***